# మరణ కారణం

## ప్రాచీన గాథాలహరి

### ౧

గౌతమి ఆ దుర్వార్త విని మొదలు నరికిన తరువులా నేలపై కూలబడిపోయింది. ఆమె ఏకైకపుత్రుడు, అయిదేళ్ళవాడు, ఆడుకుంటూ ఆడుకుంటూ పాము కరిచి నురగలు గక్కుకుంటూ అక్కడే పడిపోయాడు! ఇరుగు పొరుగు వారంతా ఆ పసివాణ్ణి గౌతమి కుటీరానికి తీసుకు వచ్చారు. అంతలోనే ఆ పసివాడి ప్రాణం కాస్తా ఎగిరిపోయింది.

ఆ విష సర్పం కరిచీ కరవడంతోనే ఆ భయోద్వేగం వల్లనే ఆ పసివాడి ప్రాణాలెగిరిపోయాయేమో! ఎవరు చెప్పగలరు? అంతా అయిపోయిన తరవాత పదిమందీ పది విధాలుగా గౌతమిని ఓదార్చారు.

క్రమంగా ఇరుగుపొరుగు వారా కుమారుని కంత్యక్రియలు జరిపించి తమ తమ ఇళ్ళకు మళ్ళిపోయారు. పొద్దు వాలేవరకు చిట్టి చిట్టి పరుగులు పెడుతూ ఆమె కళ్ళ కెదురుగా ఆడుకునే పసివాడు సూర్యాస్తమయం అయ్యేసరికి అదృశ్యుడై పోయాడు!

గౌతమి ఆ దురదృష్టం తలుచుకుని కుమిలి కుమిలి ఏడ్చింది. ఇరుగు పొరుగులున్నంతవరకు కొంతవరకు ఉపశమించిన ఆమెదుఃఖం వారంతా ఇళ్ళకు మళ్లిపోగానే పరవళ్లు దొక్కుతూ పైకుబికింది. ఆ చిన్ని కుమారుని ముద్దులీలలు తలుచుకొన్న కొద్దీ ఆమె దుఃఖం మరింత పెచ్చు పెరిగిపోయింది.

అంతలో పంజె చీకట్లు కాలుకుపైపులా అలుముకొన్నాయి. ప్రపంచం అంతా సాయంకాల కాలసర్పం నోటిలో ప్రవేశిస్తున్నట్టు బాగా మసకమసకగా మారిపోయింది.

పిమ్మట ఒక బోయవాడక్కడికి వచ్చాడు. అతని చేతికర్ర చిట్టచివర ఒక పెద్ద నాగసర్పం వేళ్లాడుతూంది. బోయవాడు తాటితో దాని కంఠానికి ఉచ్చు బిగించాడు. ఆ చేతికర్ర పైకెత్తి పట్టుకుని గౌతమి కెదురుగా నిలబడ్డాడు:

"అమ్మా! నీ పసిపిల్లవాడి ప్రాణాలు పొట్టబెట్టుకొన్న విషసర్పం ఇదే! నన్ను తప్పించుకొని పారిపోవడానికి దీని కెన్ని గుండెలున్నాయి? ఎలాగో అలాగ వెతికి వెతికి పట్టుకున్నాను. ఎక్కడికి పోతుందిది? దీన్ని నా చేతి కత్తితో ముక్కలు ముక్కలుగా నరికి వెయ్యమన్నావా? లేకపోతే భగభగమండే మంటలోపడవేసి భస్మం చెయ్యమన్నావా? ఏమి చెయ్యమన్నావో చెప్పు!"

అని ఎంతో జాలిగా ఆమెవైపు చూశాడు. ఆమె ఆ విష సర్పాన్ని చూచి అలాగే దిగాలుపడిపోయింది. అంతేగాని ఇక ఏమనడానికీ ఆమె నోట మాటరాలేదు!

గౌతమి చాలా ధర్మస్వభావురాలు. భర్తృవియోగం కలిగినప్పటినించీ ఆ పసికందుమీదే పంచప్రాణాలు పెట్టుకుని నిత్యము గృహదేవతా పూజలతోనే పొద్దుపుచ్చేది. ఎవరికైనా కష్టమొస్తే ఇట్టే కంటనీరు పెట్టుకునేది. చాలా జాలిగుండె. ఇరుగు పొరుగు వారందరికీ తలలో నాలుకలా మసులుకొనే ఆ ఉత్తమ సాధ్వికి అంతటి ఆపత్తు వచ్చిందేమి అని ఆ జనపద నివాసులంతా ఎంతో విచారించారు. అది అలాంటి ఉత్తమురాలికిరావలసినఆపద కాదని వారందరూ కంట తడిపెట్టారు. వారందరు ఆమెను ఓదారుస్తూంటే బోయవాడదంతా విన్నాడు.

అతనికి కూడా ఆమె దీనావస్థ చూచేసరికి గుండె నీరైపోయింది. వెంటనే ఆ పరిసరం అంతా గాలించి ఆ విషసర్పాన్ని పట్టుకొన్నాడు. ఆమె కెదురుగానే దానిని ముక్కముక్కలుగా నరికివేస్తే ఆమెకు కొంతవరకైనా మనశ్శాంతి కలగగలదని అనుకొన్నాడు. కాని ఆమె ఆ సర్పాన్ని చంపివేయడాని కంగీకరించలేదు. పైగా తాటితో ఉచ్చుబిగించడం మూలంగా అది విలవిలా తన్నుకుని ఎంతో బాధపడుతున్నదనీ, దానిని వెనువెంటనే విడిచిపెట్టి వెయ్యవలసిందనీ ప్రార్థించింది. కాని బోయవాడా మాట వినలేదు.

**పి. గణపతి శాస్త్రి**

"నాయనా! దాన్ని చంపివేస్తే చచ్చిపోయిన నా కొడుకు మళ్లీ బతికివస్తాడా? ఏమన్నావా? పాపం! నిష్కారణంగా దాన్నికూడా చంపడం ఎందుకులే. విడిచిపెట్టు. పాపం! నోరులేనిప్రాణి!"

అని వల వలా వాపోయింది. బోయ ఆమాటవిని ఒక్క వికృతనవ్వు నవ్వాడు:

"అమ్మా! నీవంటి అమాయికురాలిని నేనెక్కడా కనీ వినీ ఎరగను! పసికందు ప్రాణాలు పొట్టబెట్టుకొన్న విషనాగును విడిచిపెట్టి వెళ్లిపొమ్మంటే వెళ్లిపోతా ననుకున్నావా? ఇది జరిగేపని గాదు!"

అని బోయ దాన్ని ముక్కలు ముక్కలుగా నరికివేసేకోపంతో ఒరలోని చేతికత్తి తటాలున పైకిలాగబోయాడు.

"ఏమైనాసరే! నీవు దీనిని చంపడానికి నేనంగీకరించను! ఈప్రాణిహింస నా కళ్లెదట జరుగుతూంటే నేను చూస్తూ ఊరుకోలేను!"

అని అతని చేతి కడ్డుపడిందా బ్రాహ్మణి.

"ఇలాంటి విషనాగును చంపివెయ్యడం కూడా హింసేనా? చాల్చాలు లేవమ్మా! ఎక్కడనేర్చావమ్మా! ఈ ధర్మాలన్నీని! ఇప్పుడు దీన్ని విడిచిపెడితే ఇంకా ఇది ఎంతిమందిని చంపుతుందో."

అని బోయవాడామె చేతిపట్టు విడిపించుకొని ఒరలో ఉన్న కత్తి మళ్లీ పైకిలాగబోయాడు.

అయినా ఆమె అతన్ని విడిచిపెట్టలేదు! సర్పాన్నేమీ చేయవద్దనీ దాన్ని విడిచివెయ్యవలసిందనీ పరిపరివిధాలుగా బతిమాలింది. అంతలో వారిద్దరికీ అశరీరవాణిలాగ ఒక సన్నని పిలుపు వినబడింది. బోయ నిర్ఘాంతపడి అటువైపు చూచాడు. గౌతమి కాపిలుపు అతి విచిత్రంగా వినబడింది. అది బోయచేతికర్ర చివర ఉచ్చులో ఊపిరి ఆడకుండా కొట్టుకుంటున్న నాగుబాము కంఠంలోనుంచి వెలువడిన పిలుపు! అదివిని వారిద్దరు నిలువునా నిర్ఘాంతపోయారు!

### ౨

నాగుబాము బోయ కేసి తిరిగి సన్నని గొంతుతో మొర పెట్టుకుంది: "అయ్యా! నీవనవసరంగా నామీద పగబట్టి మాట్లాడుతున్నావుగాని దీనిలో నేను చేసినతప్పేమీ లేదు! నేను మృత్యుదేవత చేతిలో కేవలం

# నమ్మకాలు; చింతకాయలూ

మంత్రాలకు చింతకాయలు రాలవని సామెత; రాలుతాయని మన దేశంలో ఒక నమ్మకం.

కొన్ని సందర్భాలలో చింతకాయలు రాలనందువల్ల, వాటిమీద మనుషుల నమ్మకాలే రాలిపోయాయి! చింతకాయలు రాలగా చూచినవారికి నమ్మకాలు గట్టిగా నిలిచిపోయాయి.

బాణుకుమంత్రం మొదలు శాపం ఇవ్వడంవరకూ—తేలుమంత్రం, పాముమంత్రం, చేతబడి మొదలైన రకరకాల మంత్రాలు ఉన్నాయంటారు. క్రీస్తుశకంలో శాపాలకథలు వినకపోయినా, కనకపోయినా, అంతకన్న చిన్నరకం మంత్రాల గురించి, వాటి మహిమలను గురించి కథలు వింటునే ఉంటాం.

మీరు ఇవి నిజం అంటారా? ఉత్తి కథలంటారా? ఏమన దలచుకున్నా దాన్ని రుజువు చేయడానికి మీకు తెలిసిన — జరిగిన కథలూ నిదర్శనాలు సాక్ష్యమైనంత క్లుప్తంగా వ్రాసి పంపితే ప్రకటిస్తాము.

* * * *

"మంత్రాలు; నమ్మకాలు శీర్షికకు" అని స్పష్టంగా కవరుమీద వ్రాసి, ఆంధ్ర వారపత్రిక చిరునామాకు పంపండి.

—ఎడిటర్.

## ★ మరణ కారణం ★

ఒక కీలుబొమ్మను! ఆ దేవత ఎలాగ ఆడిస్తే అలాగే ఆడుతున్నాను. ఇందులో నా తప్పిదం ఏమిఉన్నది? నాకా పసిపిల్లవాడి మీద కోపతాపాలేవీ లేవు. అన్యాయంగా నన్నెందుకు సంహరిస్తావు. నేనెవరికీ ఏ విధమైన అపకారమూ చెయ్యలేదు. కొంచెం విదానించి ఆలోచించిచూడు!"

ఆ మాటలు విని బోయవాడు వెటకారంగా ఒక పెద్దనవ్వు నవ్వాడు.

"ఎవరో శత్రువులు బాణం వేశారనీ పాపం బాణంచేసిన తప్పేమీ లేదనిచెప్పి బాణం ముక్కలుముక్కలు గాఖండించకుండా ఊరుకునేవారెవరైనా ఉన్నారా? ఎవ్వరో కరవమన్నారని చెప్పి ఏ పాపము ఎరుగని ఆ పసివాణ్ణికరచి పారిపోతావా? పైగా నాతప్పేమీ లేదని వాదిస్తావా? అదిగాక మృత్యుదేవతకు మీరంతా ప్రాణంతో ఉన్న ఉపకరణాలు! కనక మీ అందరితలలు చితక పొడిచివెయ్యవలసిందే!"

అని బోయ మళ్ళీ ఒరలోని కత్తి పైకి తీయబోయాడు. అంతలో సర్పం మళ్లీ అడిగింది: "ఆగు! ఆగు! నా ప్రశ్నకు తిన్నగా సమాధానం చెప్పు! ప్రాణంతో ఉన్న ఉపకరణాలన్నీ ఒకవ్యక్తి చేసిన కర్మల ఫలితాలనుభవిస్తున్నాయా?"

"అనుభవించితీరవలసిందే!" అన్నాడు బోయ కురహంకారంతో హుంకరిస్తూ.

"అయితే ఒక్క ప్రశ్న! యజ్ఞకర్తకు ఋత్విక్కులు ప్రాణాలతో ఉన్న ఉపకరణాలేనా?" విషసర్పం నిలదీసి అడిగింది.

"బోయకా ప్రశ్న ఎందుకు పుట్టిందో తెలియలేదు. అందుచేత కొంత విసుగుదలతో సమాధానం ఇచ్చాడు:

"కాకేమి? కాదని ఎవరన్నారు?"

"యజ్ఞకర్తకు వారంతా స్వప్రాణ పరికరాలేగదా?"

"అవును!"

"అయితే యజ్ఞఫలితం ఋత్విక్కులకెందుకు చెందడంలేదు! యజ్ఞఫలితం అంతా యజమానికే చెందనేల?"

ఆప్రశ్నతో బోయవానినోటిమాట కట్టుబడిపోయింది. అతనికిక ఏమనడానికీ పాలుపోలేదు. ఆ సర్పం శిశుమరణంలో తన తప్పిదమేమీ లేదనీ మృత్యుదేవతే దానికి కారణమనీ మృత్యుదేవత ఆజ్ఞానిర్వహణంలో తన పాపం లేదనీ సోదాహరణంగా నిరూపించింది.

ఇక బోయ ఏమని సమాధానం చెప్పగలడు? క్షణకాలం అలాగే ఆసర్పం కళ్ళకేసి చూస్తూ నిలుచున్నాడు. అతనికదంతా ఏదో ఒక విచిత్రమైన ఇంద్రజాలంలా కనిపించింది. ఆ విషసర్పం ఏదో మిషపెట్టి తప్పించుకుపోవడానికే అధికంగా ప్రసంగిస్తున్నదని అనిపించింది కాని అది చెప్పిన దానికిమీ ప్రత్యుత్తరంతోచలేదు. చేతికత్తితో దానిని ముక్కముక్కలుగానరికి వెయ్యడమే దాని ప్రశ్నకొక చక్కని సమాధానం కాగలదని అనుకొన్నాడు. అప్రయత్నంగా అతని చెయ్యి తిరిగీ ఒరమీదికి పోయింది.

అంతలో మృత్యుదేవత అక్కడ ప్రత్యక్షమై అతని కెదురుగా నిలబడింది. కాని అతని వైపైనా చూడకుండా విషసర్పంతో సంభాషణ మొదలుపెట్టింది:

"ఇదేమిటీ అన్యాయం?"

"దీనిలో నేను చేసిన అన్యాయం ఏమి ఉంది? నీ ప్రేరణవల్ల నే ఆపసివాణ్ణి చంపివేశానని చెప్పాను"


"దీనిలో నేను చేసినదికూడా ఏమీలేదే! అన్యాయంగా ఈ నిందఅంతా నా మీదికి నెట్టివేశావు! నీవు చేసినట్టే నేనుకూడా మరి ఒకరి ఆజ్ఞ ప్రకారమే నావిధి కృత్యం నిర్వర్తించాను. అంతే! దీనిలో నీవు నేను కూడా అస్వతంత్రులమే!"

"ఓహో! అలాగా! ఎవరిచేత?"

"నేను నిన్నాజ్ఞాపించినట్టే కాలపురుషుడు నన్నీ పని చెయ్యమని ఆజ్ఞాపించాడు. అంతే గాని నే నేపాపము ఎరగను. అనవసరంగా నన్నెందుకు నిందిస్తావు"

ఆ మాట విని నాగుబాము కొంచెం తమాయించుకొని నెమ్మదిగా సమాధానం చెప్పింది:

"నేను నీమీద ప్రత్యేకంగా మోపిన నింద ఏమీలేదు నీ ఆజ్ఞప్రకారం నడుచుకున్నాననీ దీనిలో నాతప్పిదమేమీ లేదనీ అన్నాను. అంతే! ఈతప్పిదమెవరిదైతే నాకేమి కావాలి ఇదంతా కాలపురుషుడే చేశాడని నీవంటున్నావు. ఆకాలపురుషుణ్ణే



[ధగధగ మెరిసే కాంతిని చల్లే
కళ్లు నెమిలి కెవరిచ్చారో,
పురి విప్పుతు అది నాట్యమాడగా
తాండవకృష్ణుడు జ్ఞప్తికి రాడా!] (చింతా దీక్షితులు)

—ఫొటో: బి. పి. శాస్త్రి.

మాత్రం నేనెందుకు నిందించాలి? దీనిలో నా తప్పేమీ లేదని చెప్పడమే నా ఉద్దేశ్యం! ఈ కార్యకారణ భావాల గొడవంతా నా కెందుకు?"

ఆ సంభాషణ వినగానే బోయ కెంతో ఆశ్చర్యం వేసింది! ఆ పసిపిల్లవాణి ఆ పాము కరిచింది. వెంటనే ఆ పిల్లవాడు చనిపోతాడు. కళ్ళున్న వారి కెవరికైనా ఆ విషయం విస్పష్టంగా తెలిసిపోతుంది. ఇంత విస్పష్టమైన విషయంమీద నాగుబాము, మృత్యువు కలిసి అనవసరమైన వాదోపవాదాలు పెంచుతున్నాయి ఇలాంటి స్వల్ప విషయంలో ఇంతింత వాదోపవాదాల అవసరం ఏమి ఉంది? అని వాడిలాగే ఆశ్చర్యపోయాడు. అయినా వాదోపవాదాలు జరుగుతూంటే అతని కిక వినక తప్పలేదు.

పిమ్మట నాగుబాము బోయకేసి తిరిగింది: "విన్నావా? మృత్యుదేవత చెప్పిన మాటలు. నిజానికి మే మిద్దరము కూడా దీనిలో నిర్దోషుల మే! కాలపురుషుని ఆజ్ఞ ప్రకారమే ఈ ప్రపంచ లీల అంతా అవిచ్ఛిన్నంగా సాగిపోతున్నది. సూర్యచంద్రాదు లందరూ కాలపురుషుని ఆజ్ఞ ప్రకారంగా క్రమం తప్పకుండా సాగిపోతున్నారు. సృష్టికీ, స్థితికీ, లయానికీ కాలపురుషుడే మూల కారణం. ప్రాణు లన్నీ కాలానుగుణంగా ఈ లోకంలో ఉద్భవిస్తున్నాయి. సమకాలం తీరిపోగానే ప్రాణత్యాగం చేస్తున్నాయి చివరకన్నీ కాలగర్భంలో లీనమైపోతున్నాయి. కొంచెం గాఢంగా

# ★ మరణ కారణం ★

మననం చేస్తే నీకే ఇది తెలిసిపోతుంది. కొంచెం నిదానించు నాయనా! అనవసరంగా హింసకెందుకు పాల్పడతావు?"

బోయ కదంతా వింటూన్న కొద్దీ బాగా విసుగెత్తిపోయింది. కాని ఆ వాదోపవాదాలు సాగించేవారు సామాన్యులు కారు. ఒకవైపున సాక్షాత్తుగా మృత్యుదేవతే నిలబడింది. తన తప్పేమీ లేదని వాదిస్తున్నది. మరిఒకవైపున విషసర్పం తన తప్పేమైనా ఉంటే అది మృత్యుదేవత ఆజ్ఞానిర్వహణమేననీ, అంతకుమించిన దోషమేమీ లేదనీ అంటున్నది. ఏతావతా దానికంతటికీ కాలపురుషుడే కారణమని తేలిపోయింది.

అయినా బోయ కదంతా కేవలం అసంబద్ధంగానే కనిపించింది. అతడు మృత్యువు కేసీ, సర్పం కేసీ చూసి రుసరుసలాడాడు: "మీ రిద్దరు మహా పాపాత్ములే! నిష్కారణంగా ఏ పాపము ఎరుగని పసిపాప ప్రాణాలు తీశారు. మిమ్మ ల్నిద్దరినీ ఇక ఏమి చేసినా పాపం లేదు!"

మృత్యుదేవత అతనివైపు చూచి చిరునవ్వు నవ్వింది. "మే మిద్దరము కాలపురుషుని భృత్యులమే. ఇద్దరము అతని ఆజ్ఞ ప్రకారమే నడుచుకున్నాము. దీనిలో మా తప్పేమీ లేదు! ఆ పైన నీ ఇష్టం!"

గౌతమికి ఆ వాదోపవాదాలన్నీ చాలా విచిత్రంగా కనిపించాయి. కాని సర్పము, మృత్యుదేవత చెప్పిన విషయాలలో ఆమెకేమీ అనుమానం కలగలేదు. అయినా ఆ బోయవాడు తాను పట్టిన కుందేటికి మూడే కాళ్లని కూర్చున్నాడు. తన కదంతా తెలియదనీ, ఆ విషసర్పాన్ని సంహరించి తీరతాననీ పంతం పట్టాడు. తనకంటె మృత్యుదేవతే అతనికి బాగా నచ్చజెప్పగలదనే ధైర్యంతో గౌతమి ఆ వాదోపవాదాలన్నీ వింటూ అలాగే కూర్చుండిపోయింది.

మృత్యుదేవత తిరిగీ, అతనికి తమ ఇద్దరి పరాధీనత్వము వివరించి చెప్పింది. ఆ శిశువు మరణంలో సర్పము, తాను కేవలం నిర్దోషులమని అనేక విధాలుగా నిర్ధారణ చేసింది.

"ఏమో! నాకీ మెట్ట వేదాంతాలేవీ నచ్చలేదు! నే నీ సర్పాన్ని చంపితీరతాను! ఇంక ఎవరేమి చెప్పినా విడదలుచుకోలేదు!"

అని బోయ తన ఒరలోని కత్తి పైకెత్తి పట్టుకొన్నాడు. అంతలోనే కాలపురుషు డక్కడ ప్రత్యక్షమైనాడు!

## 3

ఆ నూతన పురుషుణ్ణి చూచి బోయ మళ్ళీ నిర్ఘాంతపోయాడు. విషసర్పము, మృత్యువు బోయవైపు చూచి ఒకేమాటగా ఇలా గన్నాయి:

"అదుగో, ఆ కాలపురుషుడే ఇక్కడికి విచ్చేశాడు! ఆయన్నే అడుగు, నీ సందేహాలన్నీ తీరిపోతాయి!"

అని సవినయంగా కాలపురుషుని కెదురుగా నిలుచున్నాయి. కాలపురుషుడు బోయవైపు చూచి ఒక నవ్వు నవ్వాడు:

"నాయనా! వారిద్దరు చెప్పినది యధార్థమే! ఆ ఇద్దరూ నిర్దోషులే! నా ఆజ్ఞ ప్రకారమే వారీవిధంగా ప్రవర్తించారు!"

ఆ గంభీరస్వరం వినగానే బోయకిక ఏమనడానికీ నుక్క తిరగలేదు.

మళ్ళీ మేఘ గంభీర స్వరంతో కాలపురుషు డిలా గన్నాడు: "వెర్రివాడా! అంతమాత్రం చేత ఆ పసివాని మరణానికి నేనే కారణమని అనుకుంటున్నావేమో! ఆ విషయంలో నేనూ నిర్దోషినే! మర్త్యులు తాము చేజేతులా చేసుకొన్న మనోవాక్కాయ కర్మల మూలంగానే జనన మరణాది దుఃఖాలనుభవిస్తున్నారు! జన్మాంతరాలలో వారు వారు చేసిన కర్మల కనుగుణంగానే నేను మానవుల కాయాకర్మఫలా లందిస్తున్నాను. అంతేగాని దీనిలో నా పక్షపాతమేమీ లేదు. మర్త్యులు తమ కర్మల కనుగుణంగానే సుఖదుఃఖాలనుభవిస్తున్నారు. జీవలోకం అంతా కేవల కర్మాధీనమై అస్వతంత్రంగా సాగిపోతున్నది. నేను కూడా కర్మానుగుణంగానే ప్రవర్తిస్తూంటాను. ఈ లోకము సర్వము కర్మాధీనమే!"

అక్కడ ఉన్నవారంతా కాలపురుషుని జలధర గంభీర కంఠస్వరం వింటూ అలాగే విస్తుపోయి నిలుచున్నారు. కాని బోయ మనస్సులో ఏదో ఒక చిన్న సంశయం బయలుదేరింది. ఆ సంశయం అతని ముఖంలో చూచాయగా పొడచూపించింది. అది చూచి కాలపురుషుడు తిరిగీ ఇలా గన్నాడు:

"మీరంతా కర్మమే సర్వస్వతంత్రమనీ, మానవులంతా కేవలం కర్మాధీనులై జననమరణాదిదుఃఖాలనుభవిస్తూంటారనీ భావిస్తున్నారేమో! అది సరికాదు! కర్మకూడా సర్వస్వతంత్రం కాదు!"

ఆ మాట వినగానే అక్కడ ఉన్నవారందరి ముఖాల్లోను తిరిగీ సందేహచ్ఛాయ లలముకొన్నాయి. కాలపురుషుని కంఠస్వరం మళ్లీ గంభీరంగా ధ్వనించింది:

"ప్రపంచంలో ప్రతిప్రాణీ, ప్రతి వ్యక్తీ సర్వస్వతంత్రుడే! కాని అజ్ఞాన మూలకంగా స్వయంగా చేసిన కర్మ ఫలితం అనుభవించక తప్పదు. అయితే మానవులు తిరిగీ తమ దైనందిన సుకృతకర్మల ద్వారా ప్రాచీన కర్మబంధనాల నుండి విడివడి విముక్తులు కావచ్చును.

"నిజానికి జీవులందరు సర్వస్వతంత్రులే! నిత్య విముక్తులే! కాని అజ్ఞాన భావనమూలకంగా జనన మరణాది బంధనాలలో చిక్కుకొంటున్నారు. తిరిగీ స్వకర్మశక్తివల్లనే బంధవిముక్తులౌతున్నారు. జీవులందరికీ జననమరణాది దుఃఖాలు కలిగించే వారింకెవరూ లేరు! వారే చేజేతులా తమ బంధనాలు, సుఖదుఃఖాలు కల్పించుకొంటున్నారు.

"ఈ శిశువు స్వీయకర్మ ఫలితంవల్లనే ఈ విధంగా హఠాత్తుగా సర్పదష్టుడై మరణించాడు. నిజానికీ పసిబాలుని మృతి కితని పూర్వజన్మ కర్మఫలితమే ప్రధాన కారణం!

"ఈ జనన మరణాల కర్మ పరిణామము, ఈ కార్య కారణ భావ శృంఖల అత్యంత దురవగాహమైన విషయాలు! మహా మేధావులు మాత్రమే ఇవి అవగాహన చేసుకొని సమస్త బంధనాల నుండీ విముక్తులు కాగలరు!

"అజ్ఞులు మీ వలెనే కార్యకారణాది బంధనాలలో చిక్కుకొని నిత్యము సంకుచిత సుఖదుఃఖాల ద్వంద్వాలతో కుమిలి కృశించి పోతూంటారు!"

ఆ గంభీర జ్ఞానబోధ వినగానే గౌతమి ముఖంలో మొట్టమొదటిగా ఒక చిరునవ్వు మొలిచింది.

సర్పం తాను చెప్పింది యధార్థమే అని ఋజువైనదిగదా అని ఆనంద సూచకంగా పడగ విప్పింది. మృత్యుదేవత ఒక నిట్టూర్పు విడిచి పెట్టింది.

అదంతా విని బోయవా డతికష్టంమీద ఒక దీర్ఘ నిశ్వాసం విడిచి పెట్టాడు.

గౌతమి బోయ నెంతో ఆప్యాయంగా పిలిచింది.

"నాయనా! అసలే పసివాని మృతితో కుమిలి కృశించిపోతున్న నా కింకో పాపం కూడా చుట్టబెట్టడం ఎందుకు? ఆ నాగుబామును విడిచిపెట్టు! నా మాటవిను!"

అని బతిమాలింది. బోయవాని చేతిలోని కత్తి అప్రయత్నంగా నేలమీద పడిపోయింది.

★


కలవరపడు స్త్రీలకు



"కుమారి" (మాత్రలు) మరువకండి. మీ ఆరోగ్యం రక్షించును. చింతఅనవసరం

పెం (సాదా) రు. 3/-
(స్పెషల్) 5/-
(ఎస్ట్రాక్ స్పెషల్) 8/-
పోస్టేజీ ప్యాకింగ్ ప్రత్యేకం

Mrs. P. Devee, F.D.S. (AP) Calcutta-40.

స్టాకిస్టు: Indo Medical supplies
No. 3 Pauliappan st, Seven wells
Madras - 1.